సాక్షి
అల్లూరి సీతారామరాజు జిల్లా

శుక్రవారం । 14 । ఫిబ్రవరి । 2025



పంచామృతాభిషేకం
డాబాగార్డెన్స్: విశాఖ బురుజుపేటలో వెలసిన కనక మహాలక్ష్మి దేవస్థానంలో గురువారం త్రికాల పంచామృతాభిషేకం జరిపారు.



విపత్తుల నివారణపై పుస్తకం
డాబాగార్డెన్స్: విపత్తుల నివారణపై స్వచ్ఛంద సంస్థ 'పారా' రూపొందించిన పుస్తకాన్ని మేయర్ హరి వెంకటకుమారి ఆవిష్కరించారు.

భీమిలి ప్రేమలు


వెండితెర లవ్ స్టోరీలకు చిరునామా నిలిచిన భీమిలి ఎన్నో ప్రేమ జంటలకు ఇష్టమైన ప్రదేశం. ఇక్కడ జరిగిన పలు ప్రేమకథా చిత్రాల షూటింగ్‌పై కథనం..

8లో

న్యూస్‌రీల్

మన్యంలో మంచు తగ్గదే..
- జి.మాడుగులలో 11.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదు



చింతపల్లిలో కురుస్తున్న మంచు

చింతపల్లి: మన్యంలో కనిష్ట ఉష్ణోగ్రతల్లో మార్పులు ఉన్నప్పటికీ మంచు తీవ్రతలో ఎటువంటి తేడా కనిపించడంలేదు. వారం రోజులుగా స్థిరంగా కొనసాగుతున్న ఉష్ణోగ్రతలు గురువారం కొంతమేర తగ్గుముఖం పట్టాయి. జి.మాడుగులలో 11.3 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రత నమోదైనట్లు చింతపల్లి ప్రాంతీయ వ్యవసాయ పరిశోధన స్థానం ఏడీఆర్, వాతావరణ విభాగం నోడల్ అధికారి డాక్టర్ ఆళ్ల అప్పలస్వామి తెలిపారు. పాడేరు డివిజన్ పరిధిలో జీకే వీధిలో 11.5 డిగ్రీలు, చింతపల్లిలో 12, పాడేరులో 12.2, డుంబ్రిగుడలో 12.6, అరకువేలీలో 12.8, హుకుంపేటలో 13.1, పెదబయలులో 13.9, ముంచంగిపుట్టులో 14.6, కొయ్యూరులో 14.6 డిగ్రీల కనిష్ట ఉష్ణోగ్రతలు నమోదు కాగా అనంతగిరిలో ఎక్కువగా 19.3 డిగ్రీలు నమోదయినట్లు ఏడీఆర్ తెలిపారు.

ప్రతి రైతుకు ప్రత్యేక గుర్తింపు నంబర్
పాడేరు: కేంద్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి రైతు పదకొండు నంబర్లు కలిగిన ప్రత్యేక గుర్తింపు నంబర్ కలిగి ఉండాలని జిల్లా వ్యవసాయ శాఖ అధికారి ఎస్‌బీఎస్ నందు గురువారం ఒక ప్రకటనలో తెలిపారు. ఫార్మర్ రిజిస్ట్రీ అనే పేరుతో రైతుల వివరాలు నమోదు చేసి గుర్తింపు నంబర్‌ను కేటాయిస్తున్నామన్నారు. ఈ గుర్తింపు నంబర్ ఉంటేనే భవిష్యత్‌లో పీఎం కిసాన్, రైతు భరోసా, విత్తన సబ్సిడీ, పంటల బీమా, ధాన్యం కొనుగోలు, పంట రుణాలు, యంత్ర పరికరాలు, ఎరువులు వంటి రైతు సేవలు అందుతాయన్నారు. ఈ నంబర్ లేకుంటే పథకాలు కోల్పోతారన్నారు. భూమి కలిగి ఉన్న ప్రతి రైతు ఆధార్‌తో అనుసంధించిన ఫోన్ నంబర్, పట్టాదారు పుస్తకం తదితర వివరాలతో రైతు సేవా కేంద్రాల్లో ఈనెల 28లోగా నమోదు చేసుకోవాలన్నారు.

సకాలంలో రెవెన్యూ సేవలు
- సబ్ కలెక్టర్ కల్పశ్రీ

రంపచోడవరం: ప్రభుత్వ నిబంధనల ప్రకారం వివిధ రకాలైన రెవెన్యూ సేవలను సత్వరమే ప్రజలకు అందించాలని రంపచోడవరం సబ్ కలెక్టర్ కెఆర్ కల్పశ్రీ అన్నారు. ఐటీడీఏ సమావేశపు హాలులో గురువారం ఏజెన్సీ ఏడు మండలాల తహసీల్దార్‌లతో రెవెన్యూ సిబ్బంది, సచివాలయ సిబ్బందితో సమావేశం నిర్వహించారు. సబ్ కలెక్టర్ కల్పశ్రీ మాట్లాడుతూ భూముల మ్యూటేషన్ త్వరితగతిన చేయాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం సకాలంలో రేషన్ అందజేయాలన్నారు. తహసీల్దార్లు, వీఆర్వో క్షేత్రస్థాయిలో పర్యటించాలని ఆదేశించారు. పూర్తిస్థాయిలో పరిశీలించి వివిధ రకాల ధ్రువపత్రాలు మంజూరు చేయాలన్నారు. దేవీపట్నం మండలంలో ఆర్‌అండ్‌ఆర్ ప్యాకేజీకి సంబంధించి వివరాలు పూర్తిస్థాయిలో పరిశీలించి నివేదికలు సమర్పించాలని ఆదేశించారు. తహసీల్దార్లు రామకృష్ణ, శ్రీనివాసరావు, సత్యనారాయణ, సూర్యనారాయణ, వేణుగోపాల్ తదితరులు పాల్గొన్నారు.

ఏలూరులో వందే భారత్‌కు హాల్ట్ పొడిగింపు
తాటిచెట్లపాలెం (విశాఖ): విశాఖపట్నం-సికింద్రాబాద్-విశాఖపట్నం వందే భారత్ ఎక్స్‌ప్రెస్‌కు ఏలూరు స్టేషన్‌లో మరో ఆరు నెలలపాటు హాల్ట్ పొడిగిస్తున్నట్లు వాల్తేర్ డివిజన్ సీనియర్ డీసీఎం సందీప్ తెలిపారు. విశాఖపట్నం- సికింద్రాబాద్ (20707) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ ఉదయం 9.49 గంటలకు ఏలూరు చేరుకొని, అక్కడ నుంచి 9.50గంటలకు బయల్దేరుతుంది. తిరుగు ప్రయాణంలో సికింద్రాబాద్-విశాఖపట్నం(20708) వందేభారత్ ఎక్స్‌ప్రెస్ సాయంత్రం 5.44 గంటలకు ఏలూరు చేరుకొని అక్కడ నుంచి 5.45 గంటలకు బయల్దేరుతుంది.

వీఎంఆర్‌డీఏ సీఈగా వినయ్‌కుమార్ బాధ్యతలు
విశాఖ సిటీ: వీఎంఆర్‌డీఏ చీఫ్ ఇంజినీర్‌గా వినయ్‌కుమార్ గురువారం బాధ్యతలు స్వీకరించారు. ఇప్పటి వరకు ఈ స్థానంలో ఎస్‌ఈ భవానీశంకర్ ఇన్‌చార్జి సీఈగా వ్యవహరించారు. చాలా కాలం తరువాత ప్రభుత్వం సీఈగా వినయ్‌కుమార్‌ను నియమించింది. ఆయన బాధ్యతలు స్వీకరించిన అనంతరం వీఎంఆర్‌డీఏ చైర్‌పర్సన్ ప్రణవ్‌గోపాల్‌ను మర్యాదపూర్వకంగా కలిశారు. వీఎంఆర్‌డీఏ పరిధిలో జరుగుతున్న ప్రాజెక్టులను నిర్ణీత గడువులోగా పూర్తి చేసేలా చూడాలని చైర్‌పర్సన్ సీఈకి సూచించారు.

గిరిజన వికాసం



మన్యంలో 15 పంచాయతీలకు మహర్దశ

వికసిత్ పంచాయత్‌లుగా కేంద్రం ఎంపిక

ప్రత్యేక నిధులతో మోడల్ గ్రామాలుగా తీర్చిదిద్దే యోచన

సర్పంచ్‌లు, కార్యదర్శులకు ప్రత్యేక శిక్షణ

సాక్షి, పాడేరు: కేంద్ర ప్రభుత్వం వెనుకబడిన జిల్లాల్లోని పంచాయతీల అభివృద్ధికి ప్రత్యేక కార్యక్రమం చేపట్టింది. ఎంపిక చేసిన గ్రామాలను 'వికసిత్ పంచాయత్'లుగా తీర్చిదిద్దనుంది. **కేంద్ర ప్రభుత్వ ఆధీనంలోని కెపాసిటీ బిల్డింగ్ కమిషన్ ఏపీకి సంబంధించి అల్లూరి సీతారామరాజు జిల్లా పాడేరు డివిజన్‌లోని 15 పంచాయతీలను ఇందుకోసం ఎంపిక చేసింది. ఈ పంచాయతీలను ఒక మోడల్‌గా అభివృద్ధి చేసేందుకు ప్రత్యేక నిధులను కేటాయించనుంది. దీంతో ఆయా ప్రాంతాల గిరిజన ప్రజాప్రతినిధులు,** ప్రజలు, అన్ని శాఖల అధికారులు సంతోషం వ్యక్తం చేస్తున్నారు.

సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి

వెనుకబడిన 15 పంచాయతీలను కేంద్ర ప్రభుత్వం ఈ కార్యక్రమం కోసం ఎంపిక చేయడంతో సమగ్ర ప్రణాళికలతో అభివృద్ధి జరగనుందని అధికారులు పేర్కొంటున్నారు. కేంద్ర ప్రభుత్వం ఈ పంచాయతీలకు ప్రత్యేకంగా నిధులు మంజూరు చేయడంతో పాటు అన్ని మౌలిక సదుపాయాల కల్పనతో మోడల్ పంచాయతీలుగా అభివృద్ధి చేయనుంది. **కేంద్ర ప్రభుత్వం** ప్రత్యేకంగా పెద్ద మొత్తంలో నిధులు **విడుదల** చేయనుంది. గ్రామాలలో సీసీ రోడ్లు, **డ్రైనేజీలు,** గ్రామాల నుంచి పంచాయతీలకు **రోడ్ల అభివృద్ధి**, అన్ని గ్రామాలతో తాగునీటి సౌక**ర్యాలు,** ఇతర మౌలిక సదుపాయాలు, అంగన్**వాడీ కేంద్రా**లు, పాఠశాలల ఏర్పాటు, పక్కా **భవనాల** నిర్మాణాలు, గిరిజనుల జీవనోపాధి, వ్యవసాయ, ఉద్యానవన పంటల అభివృద్ధి తదితర లక్ష్యాలను సాధించి వికసిత్ పంచాయతీలుగా తీర్చిదిద్దనున్నారు.



తాడేపల్లిలో శిక్షణ పొందిన జిల్లా అధికారులు, సర్పంచ్‌లు, కార్యదర్శులు

జిల్లాలో ఎంపికైన పంచాయతీలు ఇవే..
పాడేరు డివిజన్ పరిధిలోని పాడేరు మండలం డోకులూరు, కిండంగి, డి.గొందూరు, మినుములూరు, గుత్తులపుట్టు, కాడెలి, వంజంగి, హుకుంపేట మండలంలోని మఠం, కొట్నాపల్లి, మెట్టుజోరు, తడిగిరి, తీగలవలస, గడి కించుమండ, తాడిపుట్టు, జి.మాడుగుల మండలం బొయితిలి పంచాయతీలు

సర్పంచ్‌లు, కార్యదర్శులకు శిక్షణ

ఎంపికైన 15 పంచాయతీల సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులకు రెండు రోజులుగా తాడేపల్లిలో వర్క్‌షాప్ నిర్వహిస్తున్నారు. జిల్లా నుంచి జెడ్పీ, పంచాయతీరాజ్ శాఖ అధికారులు కూడా పాల్గొంటున్నారు. కేంద్ర ప్రభుత్వ కెపాసిటీ బిల్డింగ్ కమిషన్, ఏపీ పంచాయతీరాజ్‌శాఖ సంయుక్తంగా నిర్వహిస్తున్న ఈ శిక్షణ తరగతులలో గ్రామాల అభివృద్ధికి సంబంధించి కీలక అంశాలపై చర్చిస్తున్నారు. సర్పంచ్‌లకు పంచాయతీల అభివృద్ధిలో నాయకత్వ లక్షణాలపై అవగాహన కల్పిస్తున్నారు.

వికసిత్ పంచాయత్‌లతో మేలు


మా డి.గొందూరుతోపాటు 15 పంచాయతీలను వికసిత్ పంచాయతీలుగా కేంద్ర ప్రభుత్వం ఎంపిక చేయడంతో గ్రామాల సమగ్ర అభివృద్ధికి ఎంతో మేలు జరుగుతుంది. వెనుకబడిన గ్రామాలలో మౌలిక సదుపాయాల కల్పన, సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా పనిచేస్తాం.

– సీదరి రాంబాబు, సర్పంచ్, డి.గొందూరు, పాడేరు మండలం

కేంద్ర ప్రభుత్వ నిధులు పుష్కలం


వికసిత్ పంచాయతీలకు కేంద్ర ప్రభుత్వం పుష్కలంగా నిధులు మంజూరు చేస్తుంది. సర్పంచ్‌లు, పంచాయతీ కార్యదర్శులు, అధికారులంతా భాగస్వాములై వికసిత్ పంచాయతీ కార్యక్రమాన్ని విజయవంతం చేస్తారు. మారుమూల గ్రామాలు అభివృద్ధి పథంలో పయనిస్తాయి. అన్ని సమస్యలు పరిష్కారమవుతాయి.

– పి.ఎస్.కుమార్, డివిజనల్ పంచాయతీ అధికారి, పాడేరు

హైవే నిర్మాణంతో ఎవరికీ నష్టం జరగదు
- రంపచోడవరం సబ్ కలెక్టర్ కల్పశ్రీ



రంపచోడవరం: నేషనల్ హైవే నిర్మాణం కోసం భూములు కోల్పోయిన వారికి ఎటువంటి నష్టం జరగకుండా తగిన చర్యలు తీసుకుంటామని రంపచోడవరం సబ్ కలెక్టర్ కె.ఆర్. కల్పశ్రీ చెప్పారు. ఐటీడీఏ సమావేశ మందిరంలో గురువారం వివిధ మండలాల తహసీల్దార్లు, అటవీ శాఖ అధికారులతో ఆమె సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ నేషనల్ హైవే 516 నిర్మాణం కోసం రంపచోడవరం మండలం ఐ.పోలవరం గ్రామం నుంచి రాజవొమ్మంగి మండలం వరకు రోడ్డుకు ఇరువైపులా భూములు, ఇళ్లు, చెట్లు కోల్పోయిన బాధితులకు పూర్తిస్థాయిలో నష్టపరిహారం చెల్లించే విధంగా చర్యలు చేపడతామన్నారు.

బర్డ్ ఫ్లూపై అపోహలు తొలగించాలి
పాడేరు: కోడిగుడ్లు, కోడిమాంసంపై బర్డ్ ఫ్లూ అపోహలు లేకుండా పశు వైద్యులు ప్రజలను చైతన్యవంతం చేయాలని జిల్లా పశుసంవర్ధక శాఖ అధికారి డాక్టర్ నర్సింహులు ఆదేశించారు. స్థానిక పశుసంవర్ధక శాఖ కార్యాలయంలో గురువారం జిల్లాలోని అసిస్టెంట్ డైరెక్టర్లు, పశు వైద్యులతో సమావేశం నిర్వహించారు. 21వ లైఫ్ స్టాక్ సెన్సెస్ ఈనెలలోగా పూర్తి చేయాలన్నారు. ఇంకా పెండింగ్‌లో ఉన్న 373 గ్రామాల్లో త్వరితగతిన పశుగణన చేపట్టాలన్నారు. గొర్రెలకు, మేకలకు టీకాల కార్యక్రమం వేగవంతం చేయాలన్నారు.

రోడ్డు ప్రమాదాలకు అడ్డుకట్ట
- అన్ని వర్గాల ప్రజలకు విస్తృత అవగాహన
- అనధికార పార్కింగ్‌లపై చర్యలు
- కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాలు

సాక్షి, పాడేరు: జిల్లాలో రహదారి ప్రమాదాల నివారణపై అన్ని వర్గాల ప్రజలకు అవగాహన కలిగించాలని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్‌కుమార్ ఆదేశించారు. గురువారం కలెక్టరేట్‌లో రహదారి భద్రత సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రోడ్డు ప్రమాదాల నివారణకు అన్ని చర్యలు తీసుకోవాలన్నారు. అవసరమైన రోడ్లలో స్పీడ్ బ్రేకర్లు, సూచిక బోర్డులు ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ఆర్ అండ్ బీ, జాతీయ రహదారులు, వైద్య, రవాణాశాఖ అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. ప్రధాన జంక్షన్లలో హైమాస్ట్ లైట్లు ఏర్పాటు చేయాలని, రద్దీ ప్రదేశాలలో పార్కింగ్ సమస్య పరిష్కరించాలన్నారు. అనధికార పార్కింగ్‌లపై చర్యలు తీసుకుని జరిమానాలు విధించాలన్నారు. బైక్ చోదకులంతా హెల్మెట్‌లు ధరించే విధంగా చర్యలు తీసుకోవాలన్నారు. కోతకు గురైన రహదారి అంచుల అభివృద్ధితో పాటు రోడ్డుకు ఇరువైపులా జంగిల్ క్లియరెన్స్ పనులు చేపట్టాలన్నారు. ప్రస్తుతం రహదారి భద్రత మాసోత్సవాలు జరుగుతున్నందున ప్రమాదాల నివారణ అంశాలపై తమకు నివేదికలు ఇవ్వాలన్నారు. ప్రభుత్వ నిబంధనల ప్రకారం ఆర్ అండ్ బీ కార్యనిర్వాహక ఇంజినీర్ కన్వీనర్‌గా వచ్చేసారి రహదారి భద్రత సమావేశం నిర్వహించాలన్నారు. ఈ సమావేశంలో ఎస్పీ అమిత్ బర్దర్, ఏఎస్పీ ధీరజ్, జిల్లా రవాణా అధికారి లీలాప్రసాద్, మోటార్ వెహికల్ అధికారి వాసు, జిల్లా ప్రజారవాణా శాఖ అధికారి ఉమామహేశ్వరరావు, డీసీహెచ్‌ఎస్ డాక్టర్ కృష్ణారావు, వైద్యుడు డాక్టర్ నరసింహరావు, ఆర్‌అండ్‌బీ అధికారులు పాల్గొన్నారు.

ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల బరిలో 10 మంది
మహారాణిపేట (విశాఖ): ఉత్తరాంధ్ర ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నిక బరిలో పది మంది అభ్యర్థులు నిలిచినట్లు కలెక్టర్, రిటర్నింగ్ అధికారి ఎం.ఎన్.హరేంధిర ప్రసాద్ తెలిపారు. నామినేషన్ల ఉపసంహరణకు గురువారం గడువు కాగా.. ఏ ఒక్కరూ ఉపసంహరించుకోలేదని పేర్కొన్నారు. కలెక్టరేట్‌లో డీసీపీ అజిత, ఏఆర్వో, జిల్లా రెవెన్యూ అధికారి బిహెచ్. భవానీశంకర్‌తో కలిసి ఎమ్మెల్సీ ఎన్నికల ప్రక్రియకు సంబంధించిన వివరాలను వెల్లడించారు. ఈనెల 27వ తేదీ పోలింగ్, మార్చి 3న కౌంటింగ్ జరగనుందని తెలిపారు. మార్చి 8వ తేదీతో ఎన్నికల ప్రక్రియ ముగుస్తుందన్నారు. జిల్లాలో ఎన్నికల ప్రవర్తనా నియమావళి పటిష్ట అమలుకు చర్యలు తీసుకున్నామని, దానిలో భాగంగా వివిధ స్థాయి అధికారులతో 12 ఎంసీసీ బృందాలను నియమించామని చెప్పారు. అలాగే మండలానికి ఒకటి చొప్పున 11 ఫ్లయింగ్ స్క్వాడ్‌లను ఏర్పాటు చేశామన్నారు.

ఓటర్లు 22,493.. పోలింగ్ కేంద్రాలు 123

ఉత్తరాంధ్ర పరిధిలో మొత్తం 22,493 మంది ఓటర్లు ఉన్నారని, ఇందులో పురుష ఓటర్లు 13,508 మహిళా ఓటర్లు 8,985 మంది ఉన్నారని పేర్కొన్నారు. 123 పోలింగ్ కేంద్రాలు ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ఎన్నికల ప్రక్రియను సజావుగా నిర్వహించేందుకు వీలుగా పోలింగ్ కేంద్రాల్లో వెబ్ కాస్టింగ్, వీడియో గ్రఫీ ఏర్పాటు చేస్తున్నామని చెప్పారు. ఓటర్లకు వివరాలతో కూడిన స్లిప్పులను అందజేస్తామన్నారు.



మాట్లాడుతున్న విశాఖ కలెక్టర్ హరేంధిర ప్రసాద్

ఏయూ ఇంజనీరింగ్ కళాశాలలో కౌంటింగ్!

కౌంటింగ్ ప్రక్రియను ఏయూ ఇంజనీరింగ్ కళాశాల వేదికగా నిర్వహించనున్నట్లు కలెక్టర్ పేర్కొన్నారు. ఈ మేరకు ఎన్నికల సంఘానికి నివేదించామని ఆమోదం వస్తే పూర్తి స్థాయి చర్యలు తీసుకుంటామని చెప్పారు. ఇంజినీరింగ్ కళాశాల పరిధిలో ఈఈఈ బ్లాక్‌ను గుర్తించామని వివరించారు.

ఎన్నికలకు అభ్యర్థులు సహకరించాలి

ఎన్నికలను ప్రశాంత వాతావరణంలో నిర్వహించేందుకు అభ్యర్థులు పూర్తి సహకారం అందించాలని కలెక్టర్ హరేంధిర ప్రసాద్ విజ్ఞప్తి చేశారు. నామినేషన్ ఉప సంహరణ ప్రక్రియ గడువు ముగిసిన వెంటనే పోటీలో ఉంటున్న అభ్యర్థులతో ఆయన ప్రత్యేకంగా సమావేశమయ్యారు. ప్రవర్తనా నియమావళి, పోలింగ్, కౌంటింగ్ ఏజెంట్ల నియామకం, ప్రచారం, అనుమతుల విషయంలో అనుసరించాల్సిన విధానాలపై సూచనలు చేశారు. వాహనాలు, కరపత్రాల ముద్రణ, ప్రచారం వంటి అంశాలకు సంబంధించిన కలెక్టరేట్‌లో ఏర్పాటు చేసిన సింగిల్ విండో డెస్కు ద్వారా అనుమతులు తీసుకోవాలని సూచించారు.

స్టెమీతో గుండెకు భరోసా



స్టెమీ పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఎస్పీ అమిత్ బర్దర్, ఏఎస్పీ ధీరజ్

- 'టెనెక్ట్‌ప్లేజ్'తో ఆకస్మిక మరణానికి దూరం
- అన్ని సెకండరీ ఆస్పత్రులలో లభ్యం
- కలెక్టర్ దినేష్‌కుమార్

సాక్షి, పాడేరు: స్టెమీ చికిత్స విధానంతో హృద్రోగులకు భరోసా లభిస్తుందని కలెక్టర్ ఎ.ఎస్.దినేష్ కుమార్ అన్నారు. గురువారం కలెక్టరేట్‌లో స్టెమీ ప్రచార పోస్టర్లను అధికారులతో కలిసి ఆయర ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ఛాతి నొప్పి, భుజం లాగడం, ఆకస్మిక ఆయాసం, గుండెదడ, స్పృహ కోల్పోవడం వంటి అనారోగ్య పరిస్థితులలో టెనెక్ట్‌ప్లేజ్ ఇంజక్షన్ చేయించుకుంటే ఆకస్మిక మరణాలకు దూరం కావచ్చని, తరువాత చికిత్సకు సమయం దొరుకుతుందన్నారు. రూ.45 వేలు విలువ చేసే ఈ ఇంజక్షన్లను ప్రభుత్వ ఆస్పత్రులలో ఉచితంగా రోగులకు అందిస్తారన్నారు. జిల్లాలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్లు, ఏరియా ఆస్పత్రులు, జిల్లా సర్వజన ఆస్పత్రి, మెడికల్ కళాశాల వంటి సెకండరీ ఆస్పత్రులలో ఈ ఇంజక్షన్లు అందుబాటులో ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎస్పీ అమిత్ బర్దర్, ఏఎస్పీ ధీరజ్, జిల్లా రవాణా అధికారి లీలాప్రసాద్, వైద్య విధాన పరిషత్ జిల్లా సమన్వయకర్త డాక్టర్ కృష్ణారావు, గైనిక్ వైద్యనిపుణులు డాక్టర్ తమర్భ నరసింగరావులు పాల్గొన్నారు.

జాతీయస్థాయి యూత్ ఫెస్టివల్‌కు గిరిజన విద్యార్థి



విద్యార్థి బలరాంతో ప్రిన్సిపాల్ భరత్‌కుమార్ నాయక్, అధ్యాపకులు

అరకులోయటౌన్: డార్జిలింగ్‌లో ఈనెల 17 నుంచి 23వ తేదీ వరకు జరగనున్న జాతీయ స్థాయి ట్రైబల్ యూత్ ఫెస్టివల్ ప్రోగ్రాంకు స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి వి.బలరామ్ పాల్గొంటున్నట్లు కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ కె.భరత్ కుమార్ నాయక్ తెలిపారు. ఇటువంటి కార్యక్రమాల్లో విద్యార్థులు పాల్గొనడం ద్వారా గిరిజన సంస్కృతి, సంప్రదాయాలపై పూర్తిగా అవగాహన కలుగుతుందన్నారు. అనంతరం కళాశాల విద్యార్థులకు ఎన్ఎస్ఎస్, ఎన్వైకే ఆ ధ్వర్యంలో పర్సనాలిటీ డెవలప్‌మెంట్‌పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ కె.పుష్పరాజ్, ఎన్ఎస్ఎస్ పీవోలు విజయలక్ష్మి, అనిత కుమారి, నాగబాబు, ప్రభుత్వ జూనియర్ కళాశాల ప్రిన్సిపాల్ కె.పార్వతి, అధ్యాపకులు పాల్గొన్నారు.

ఏకలవ్య ప్రవేశ పరీక్ష వాయిదా
చింతూరు/చింతపల్లి: ఈనెల 25న జరగాల్సిన ఏకలవ్య ప్రవేశ పరీక్ష వచ్చే నెల రెండో తేదీకి వాయిదా పడినట్లు ఇన్‌చార్జ్ ఐటీడీఏ పీవో కల్పశ్రీ, చింతపల్లి ఏకలవ్య పాఠశాల ప్రిన్సిపాల్ మనోజ్ కుమార్ గురువారం వేర్వేరు ప్రకటనల్లో తెలిపారు. ఏకలవ్య పాఠశాలలో ఆరో తరగతిలో ప్రవేశాల నిమిత్తం ఆన్‌లైన్‌లో దరఖాస్తులు స్వీకరించామని, అనివార్య కారణాల కారణంగా ఈ పరీక్షను వచ్చే నెలకు వాయిదా వేసినట్లు పేర్కొన్నారు. వచ్చే నెల రెండో తేదీన ఉదయం 11.30 గంటల నుంచి మధ్యాహ్నం 1.30 వరకు పరీక్ష ఉంటుందని, విద్యార్థుల తల్లిదండ్రులు ఈ విషయాన్ని గమనించాలని వారు కోరారు.

ప్రవేశాలకు దరఖాస్తు చేసుకోండి

రంపచోడవరం: రంపచోడవరం, చింతూరు ఐటీడీఏల పరిధిలో గల ఆరు ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలల్లో 2025-26 విద్యా సంవత్సరానికి ఆరో తరగతిలో ప్రవేశానికి అర్హులైన విద్యార్థులు దరఖాస్తు చేసుకోవాలని గిరిజన సంక్షేమశాఖ డిప్యూటీ డైరెక్టర్ (డీడీ) విజయశాంతి తెలిపారు. సీబీఎస్ఈ సిలబస్‌లో ఆరో తరగతిలో 360 సీట్లలో అడ్మిషన్ల పొందేందుకు నోటిఫికేషన్ జారీ చేశామన్నారు.

అర్హులైన గిరిజన విద్యార్థులు ఈ నెల 19లోగా ఆన్‌లైన్ ద్వారా దరఖాస్తు చేసుకోవాలన్నారు. ప్రవేశాలకు ఈనెల 25న నిర్వహించాల్సిన ఎంట్రన్స్ పరీక్షను గురుకులం ప్రధాన కార్యాలయం వారు మార్చి 2వ తేదీకి మార్పు చేసినట్లు తెలిపారు.

విద్యుత్ చౌర్యం పెద్ద సవాలు
- ఇప్పటి వరకు 160 కేసులు నమోదు
- కరెంటు సరఫరాలో హెచ్చుతగ్గుల నివారణకు చర్యలు
- ఈపీడీసీఎల్ ఎస్ఈ ప్రసాద్

అడ్డతీగల/రాజవొమ్మంగి: విద్యుత్ చౌర్యం లేకుండా చర్యలు తీసుకుంటూ ట్రాన్స్‌కో ఆదాయం పెంచాలని ఏపీఈపీడీసీఎల్ సూపరింటెండింగ్ ఇంజినీర్ (ఎస్ఈ) జి.ఎన్.ప్రసాద్ సిబ్బందిని ఆదేశించారు. గురువారం ఆయన అడ్డతీగల, వై.రామవరం, రాజవొమ్మంగి సబ్ స్టేషన్లతోపాటు పింజరికొండలోని చిన్నతరహా జల విద్యుత్ ప్రాజెక్ట్‌ను సందర్శించారు. సబ్‌స్టేషన్లను క్షుణ్ణంగా పరిశీలించి, విద్యుత్ సరఫరాలో హెచ్చుతగ్గుల నివారణకు తీసుకోవాల్సిన చర్యలపై సూచనలు ఇచ్చారు. రానున్న వేసవిలో రక్షిత మంచినీటి పథకాలు, ఆర్వో ప్లాంట్లలో లోవోల్టేజి కారణంగా నీటి సరఫరాకు అంతరాయం కలగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల విద్యుత్ చౌర్యం ఎక్కువగా జరుగుతోందని, ఆ సమస్యపై దృష్టి సారించామన్నారు. ఇప్పటి వరకు 160 కేసులు బుక్ చేశామన్నారు. ఇటీవల రాజవొమ్మంగిలో విద్యుత్ స్తంభాలు వేసి విద్యుత్ చౌర్యానికి పాల్పడిన కేసుకు సంబంధించి సమగ్ర విచారణ జరుగుతోందన్నారు. విద్యుత్ బకాయిలు దాదాపు రూ.135 కోట్ల వరకు ఉన్నాయన్నారు. పింజరికొండ జల విద్యుత్ కేంద్రం ద్వారా నిత్యం ఉత్పత్తి అవుతున్న విద్యుత్ వివరాలను ప్రాజెక్ట్ ఏఈ మురళిని అడిగి తెలుసుకున్నారు. పీవీటీజీ గిరిజనులు నివసించే గ్రామాలకు వందశాతం విద్యుత్ సరఫరా ఇవ్వాలని ఆదేశించారు.



పింజరికొండ పవర్ ప్రాజెక్టులో అధికారులతో మాట్లాడుతున్న ఎస్ఈ ప్రసాద్



రాజవొమ్మంగిలో విలేకరులతో మాట్లాడుతున్న ఎస్ఈ ప్రసాద్, పక్కన ఈఈ దివాకర్

25 వేల కుటుంబాలకు విద్యుత్ వెలుగులు

ప్రధానమంత్రి జన్‌మన్ పథకం ద్వారా ఇప్పటి వరకు జిల్లాలో 25 వేల ఆదివాసీ కుటుంబాలకు విద్యుత్ కనెక్షన్లు ఇచ్చినట్లు ఎస్ఈ ప్రసాద్ తెలిపారు. విద్యుత్ సదుపాయానికి నోచుకోని దాదాపు 4 వేల జనావాసాల్లోని పీవీటీజీ, నాన్ పీవీటీజీ కుటుంబాలకు సర్వీసులు ఇచ్చామన్నారు. ఎస్ఈ పర్యటనలో ఈఈ దివాకర్, ఇతర ట్రాన్స్‌కో అధికారులు పాల్గొన్నారు.

జన సంద్రమైన సమ్మక్క సారక్క జాతర



మినీ మేడారం మారాయిగూడెం సమ్మక్క సారక్క జాతర జన సంద్రమైంది. మూడో రోజు గురువారం నిండు జాతర సందర్భంగా మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి వేలాది మంది భక్తులు గద్దెలను దర్శించుకున్నారు. మధ్యాహ్నం 12 గంటలకు వనదేవతను గద్దెల వద్దకు ఊరేగింపుగా తీసుకొచ్చారు. సాయంత్రం 4 గంటలకు తల్లి దేవతను గుట్ట నుంచి గుడికి తీసుకురావడంతో గద్దెల వద్ద నిండుతనం సంతరించుకుంది. దీంతో వేలాదిమంది భక్తులు వన దేవతలను దర్శించుకుని మొక్కులు సమర్పించుకున్నారు. గిరిజన సంస్కృతి సంప్రదాయాలతో సమ్మక్క, సారక్కలకు ప్రత్యేక పూజలు చేశారు. మూడు రాష్ట్రాల సరిహద్దు ప్రాంతాల నుంచి పలువురు ప్రజాప్రతినిధులు వనదేవతను దర్శించుకున్నారు. – ఎటపాక

క్లుప్తంగా

ట్రాఫిక్ నిబంధనలు పాటించాలి


వాహనచోదకులకు అవగాహన కల్పిస్తున్న పాడేరు డీఎస్పీ షేక్ సెహబాజ్ బాషా

అరకులోయటౌన్: ద్విచక్ర వాహనచోదకులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించాలని పాడేరు డీఎస్పీ షేక్ సెహబాజ్ బాషా అన్నారు. మండల కేంద్రంలోని పోలీస్ స్టేషన్ వద్ద గురువారం వాహనచోదకులకు కౌన్సెలింగ్ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వాహనచోదకులు హెల్మెట్ లేకుండా వాహనం నడిపినా, ట్రిపుల్ రైడింగ్ చేసినా, అతివేగంతో వాహనాలు నడిపినా, మద్యం సేవించిన వాహనం నడిపినా కేసులు నమోదు చేసి, కోర్టుకు హాజరు పరుస్తామని హెచ్చరించారు. ట్రాఫిక్ నిబంధనలు పాటించాలన్నారు. అరకులోయకు వచ్చే పర్యాటకులకు ఎటువంటి ఇబ్బందులు కలిగించకూడదన్నారు. ప్రతీ రోజు వాహనాల తనిఖీలు నిర్వహిస్తామన్నారు. అరకులోయ పోలీస్‌స్టేషన్ నుంచి గిరిజన మ్యూజియం వరకు 200 బైక్‌లతో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఎస్ఐ గోపాలరావు, ద్విచక్రవాహనచోదకులు పాల్గొన్నారు.

రెయిలింగ్ తగిలి యువకుడి దుర్మరణం


తీవ్ర గాయాలతో రొంగాల ప్రణీత్


ప్రణీత్ (ఫైల్)

అక్కిరెడ్డిపాలెం: డీమార్ట్‌లో ట్రైనింగ్‌కు వెళ్తున్న యువకుడు రోడ్డు ప్రమాదానికి గురై మృతి చెందాడు. గాజువాక ట్రాఫిక్ పోలీసులు తెలిపిన వివరాలివీ.. చట్టివానిపాలెంలో నివాసం ఉంటూ ప్రైవేట్ పనులు చేసుకుంటున్న రొంగాల రవికుమార్, కంచరపాలెం అక్షయపాత్రలో పనిచేస్తున్న లక్ష్మి దంపతులకు ప్రణీత్ (24) ఒక్కడే కుమారుడు. ప్రణీత్‌కు ఇటీవల కంచరపాలెం ఊర్వశి జంక్షన్ వద్ద గల డీమార్ట్‌లో ఉద్యోగం వచ్చింది. కొన్ని రోజుల పాటు శిక్షణ అవసరం ఉండటంతో.. గురువారం ఉదయం 7 గంటల సమయంలో తన స్కూటీపై డీమార్ట్‌కు బయలుదేరాడు. షీలానగర్ సిగ్నల్ పాయింట్ దాటి కొంత దూరం వెళ్తుండగా తన స్కూటీ ఒక్కసారిగా అదుపుతప్పింది. ఈ ఘటనలో స్కూటీపై నుంచి ప్రణీత్ జారిపడగా.. రోడ్డు పక్కనున్న రెయిలింగ్ తగిలి తీవ్ర గాయాలపాలయ్యాడు. సమాచారం అందుకున్న గాజువాక ట్రాఫిక్ పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని.. తీవ్ర గాయాలపాలైన ప్రణీత్‌ను హైవే అంబులెన్స్‌లో కేజీహెచ్‌కు తరలించారు. దురదృష్టవశాత్తూ మార్గమధ్యలోనే యువకుడు మృతి చెందాడు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం కేజీహెచ్‌కు తీసుకెళ్లారు. వివరాలు సేకరించి కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

భీమిలి ప్రేమలు

ప్రేమకథా చిత్రాలకు ఎప్పుడూ ప్రత్యేక స్థానం ఉంటుంది. తరాలు.. అభిరుచులు మారుతున్నా ప్రేమకథా చిత్రాలకు ఆదరణ మాత్రం తగ్గడం లేదు. ప్రేక్షకుల హృదయాలను హత్తుకునే భావోద్వేగాలు, మధురమైన సంగీతం, హీరో హీరోయిన్ల కెమిస్ట్రీ వెరసి ప్రేమకథా చిత్రాలు మర్చిపోలేని అనుభూతిని మిగులుస్తాయి. అందుకే ఈ జానర్ సినిమాలు బాక్సాఫీస్ వద్ద కలెక్షన్ల వర్షం కురిపిస్తాయి. ఎన్నో ప్రేమకథా చిత్రాల ద్వారా ఎంతో మంది నటీనటులు వెలుగులోకి వచ్చారు. కేవలం నటీనటులే కాదు.. ఈ చిత్రాలు చిత్రీకరించిన ప్రాంతాలు కూడా సినీ చరిత్రలో శాశ్వతంగా నిలిచిపోయాయి. వాటిలో కొన్ని ప్రాంతాలు పర్యాటక ప్రదేశాలుగా కూడా అభివృద్ధి చెందాయి. అలాంటి వాటిలో భీమిలి ఒకటి. ప్రేమికుల దినోత్సవం సందర్భంగా ప్రత్యేక కథనం.

– భీమునిపట్నం


దర్శకుడు సెల్వమణి రోజాతో రూపొందించిన చామంతి చిత్రంలో చాలా సన్నివేశాలు ఈ బంగ్లాలోనే తీశారు


భీమిలి సముద్ర తీరం

వెండితెర ప్రేమకథలకు చిరునామా

ఎన్నో ప్రేమకథా చిత్రాల షూటింగ్‌లు ఇక్కడే..

ప్రేమ కథా చిత్రాల చిత్రీకరణకు భీమిలి స్వర్గధామంలా నిలిచింది. ఇక్కడ ఎన్నో సూపర్ హిట్ ప్రేమకథా చిత్రాలు చిత్రీకరించారు. ఇందుకు కారణం ప్రకృతి సౌందర్యం, ప్రశాంతమైన వాతావరణం, చారిత్రక కట్టడాలు.. ఇక్కడ సముద్రతీరం, పురాతన భవనాలు ఎంతో మంది సినీ దర్శకులను ఆకర్షించాయి. విశేషం ఏమిటంటే విభిన్న నేపథ్యాలున్న ప్రేమకథలకు భీమిలి సరిగ్గా సరిపోతుంది. పల్లెటూరి ప్రేమకథల నుంచి పట్టణ ప్రేమకథల వరకు, చారిత్రక ప్రేమకథల నుంచి సమకాలీన ప్రేమకథల వరకు ఏదైనా ఇక్కడ చిత్రీకరించవచ్చు.

ఇవే కాకుండా..

భీమిలి బీచ్, పరిసర ప్రాంతాల్లో శుభలేఖ, ముద్దమందారం, మహర్షి తదితర తెలుగు చిత్రాలతో పాటు కొన్ని హిందీ, తమిళ చిత్రాల షూటింగ్‌లు కూడా జరిగాయి. 1991లో దర్శకుడు సెల్వమణి(ఆర్.కె.రోజా భర్త) రోజాతో 'చామంతి' అనే ప్రేమ కథా చిత్రాన్ని తెరకెక్కించారు. ఈ సినిమాలోని ముఖ్య సన్నివేశాలను బ్యాంక్ రోడ్డులోని ఓషన్ వ్యూ బంగ్లా వద్ద చిత్రీకరించారు. 'రావోయి చందమామ', 'టైం' చిత్రాల్లోని ప్రేమ సన్నివేశాలను ఇక్కడే తీశారు. నరసింహస్వామి ఆలయం వద్ద శ్రీవారికి ప్రేమలేఖ, కోకిలమ్మ చిత్రాల షూటింగ్ జరిగింది. నవీన్ చంద్ర హీరోగా బ్రో, శ్రీనివాసరెడ్డి, పూర్ణ హీరోహీరోయిన్లుగా నటించిన జయమ్ము నిశ్చయమ్మురా, తాజాగా నాగచైతన్య నటించిన తండేల్ తదితర చిత్రాల షూటింగ్‌లు భీమిలి పరిసర ప్రాంతాల్లోనే జరిగాయి.

ఇప్పటికీఅలానే..

ఒక్క గాలిమేడ తప్పించి మిగిలిన నిర్మాణాలు ఇప్పటికీ అలానే ఉన్నాయి. బీచ్ దగ్గరలో గ్రంథాలయం పక్కన స్కూల్, దిమ్మ, దగ్గరలో ఇల్లు చెక్కు చెదరకుండా ఉన్నాయి ఇక్కడకు వచ్చే సందర్శకులు వీటిని చూడవచ్చు. బ్యాంక్ రోడ్డులో ఓషన్ వ్యూ బంగ్లా కూడా అలాగే ఉంది. ఇలా భీమిలి కేవలం సినిమా షూటింగ్‌లకే కాకుండా పర్యాటకంగా కూడా ఎంతో అభివృద్ధి చెందింది. సినిమాల్లో చూపిన అందమైన ప్రదేశాలను ప్రత్యక్షంగా చూడటానికి పర్యాటకులు ఇక్కడకు వస్తుంటారు. మొత్తానికి ప్రేమకథా చిత్రాలకు, భీమిలికి విడదీయరాని అనుబంధం ఏర్పడింది.


ఆరాధనలో చిరంజీవి ఇల్లు ఇదే..


ఆరాధనలో చిరంజీవి ఒంటి కాలిపై నిలబడిన సన్నివేశం ఇక్కడే తీశారు

మరో చరిత్ర.. చెరగని ముద్ర

భీమిలిలో చిత్రీకరించిన ఓ సినిమా పేరు చెప్పండి అంటే మరో ఆలోచన లేకుండా 'మరో చరిత్ర' అని చెబుతారు. ఇక్కడి అందమైన లొకేషన్లలో చిత్రీకరించిన ఈ సినిమా 1978లో విడుదలై అందరి మనసుల్లో చెరగని ముద్ర వేసింది. కె.బాలచందర్ దర్శకత్వం వహించిన ఈ చిత్రంలో కమలహాసన్, సరిత ముఖ్య పాత్రలు పోషించారు. 1850 ప్రాంతంలో డచ్ గవర్నర్ నివసించడానికి అరుదైన బంగ్లా నిర్మించారు. దీనిని 'గాలిమేడ' అని పిలిచేవారు. స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దానిని ఎవరూ ఉపయోగించకుండా వదిలేశారు.'మరోచరిత్ర' చిత్రంలోని ముఖ్యమైన సన్నివేశాలు, ఒక పాట ఈ గాలిమేడలోనే చిత్రీకరించారు. సినిమా పెద్ద విజయం సాధించడంతో ఈ బంగ్లాకు ప్రత్యేక గుర్తింపు లభించింది. సినిమా విడుదలైన తర్వాత ఈ గాలిమేడను చూడటానికి నిత్యం అనేక మంది సందర్శకులు వచ్చేవారు. అయితే 1990 ప్రాంతంలో ప్రైవేట్ వ్యక్తులు ఈ స్థలాన్ని కొనుగోలు చేసి గాలిమేడను కూల్చివేశారు. కానీ ఇప్పటికీ చాలా మంది ఆ ఖాళీ స్థలాన్ని చూసి పాత జ్ఞాపకాలను గుర్తు చేసుకుంటారు.

ఆరాధన సినిమాలో నటించాను



ఆరాధన చిత్రం ఇక్కడ సుమారు రెండు నెలల పాటు చిత్రీకరణ జరిగింది. అప్పుడు నేను 8వ తరగతి చదువుతున్నాను. ఈ సినిమాలో విద్యార్థిగానే కాకుండా, చిరంజీవి ఒంటి కాలిపై నిలబడే సన్నివేశంలో, నేను పరుగెత్తుకుంటూ వచ్చి ఆయన్ని ఆశ్చర్యంగా చూసే సన్నివేశంలో నటించాను. రోజూ ఉదయం ఏడు గంటల సమయంలో అందరికన్నా ముందు హీరోయిన్ సుహాసిని వచ్చేవారు. షూటింగ్ ప్రారంభమయ్యే లోపు నాతో పాటు మరికొందరు పిల్లలతో ఆటలు ఆడుకున్నారు. ఆ రోజులు ఇప్పటికీ గుర్తున్నాయి.

– అడిదం కిశోర్, భీమిలి,

జ్ఞాపకాల దొంతర.. ఆరాధన


ఆరాధన సినిమాలో పాఠశాల సన్నివేశాలు చిత్రీకరణ జరిగింది ఇక్కడే..

భీమిలి గ్రంథాలయం ఎదురుగా ఒకప్పుడు సరస్వతి సమాజం ఉండేది. ఇక్కడే 1986లో ప్రముఖ దర్శకుడు భారతీరాజా దర్శకత్వంలో సత్యరాజ్ (బాహుబలిలో కట్టప్ప), రేఖ నటించిన 'కడలోర కవితైగళ్' అనే తమిళ చిత్రాన్ని చాలా వరకు ఇక్కడే చిత్రీకరించారు. ఇదే సినిమాను భారతీరాజా 1987లో 'ఆరాధన' పేరుతో తెలుగులో పునర్నిర్మించారు. చిరంజీవి, సుహాసిని నటించిన ఈ 'ఆరాధన' సినిమా షూటింగ్ కూడా చాలా రోజులు భీమిలిలోనే జరిగింది. సుహాసిని విద్యా బోధన, చిరంజీవి చదువుకోవడానికి వచ్చే సన్నివేశాలు ఇక్కడ చిత్రీకరించారు. సుహాసిని పాఠశాలకు రావద్దని చెప్పడంతో చిరంజీవి దానికి ఎదురుగా ఉన్న దిమ్మపై ఒంటి కాలిపై నిలబడే సన్నివేశం, దగ్గరలో అప్పటి లైట్‌హౌస్ కీపర్‌కు సంబంధించిన క్వార్టర్స్‌లో చిరంజీవి ఇల్లు, ఆయనకు సంబంధించిన సన్నివేశాల చిత్రీకరణ ఇక్కడే జరిగింది.


ఆరాధనలో నటించిన అడిదం కిశోర్

ఎంతో సందడిగా ఉండేది



ఇక్కడ షూటింగ్‌లు ఎక్కువ రోజులు జరగడం వల్ల ఎంతో సందడిగా ఉండేది. పరిసర ప్రాంతాల నుంచి సినిమా షూటింగ్‌లు చూసేందుకు చాలా మంది తరలివచ్చారు. ముఖ్యంగా 'ఆరాధన' షూటింగ్ చాలా రోజులు జరగడం, చిరంజీవి హీరో కావడంతో విశాఖ, విజయనగరం ప్రాంతాల నుంచి భారీ ఎత్తున జనం వచ్చారు. వారిని అదుపు చేయడానికి పోలీసులు, చిత్ర యూనిట్ చాలా ఇబ్బందులు పడింది.

– టి.భీమారావు, భీమిలి

పనులు మానుకుని వెళ్లేవాళ్లం



ఇక్కడ షూటింగ్‌లు జరిగే సమయాల్లో చూసేందుకు వెళ్లేవాళ్లం. చిరంజీవి, సుహాసిని ఇతర నటీనటులను చూసేందుకు చాలా మంది ఆసక్తి చూపారు. ఆ రోజుల్లో పనులు కూడా మానుకుని షూటింగ్ చూడటానికి వెళ్లాం.

– ముగ్గు సూర్యకాంతం, భీమిలి

పట్టభద్రుల ఎమ్మెల్సీ ఎన్నికకు పకడ్బందీ ఏర్పాట్లు

ఎన్నికల పరిశీలకురాలు కె.సునీత

సాక్షి, పాడేరు: జిల్లాలో ఎమ్మెల్సీ ఎన్నికల నిర్వహణకు పకడ్బందీగా ఏర్పాట్లు చేయాలని ఉభయ గోదావరి జిల్లాల పట్టభద్రుల ఎమ్మె ల్సీ ఎన్నికల పరిశీలకులు కె.సునీత ఆదేశించారు. గురువా రం ఆమె ఏలూరు నుంచి జిల్లా కలెక్టర్, ఇతర అధికారులతో ఎన్నికల ఏర్పాట్లపై వీడియో సమావేశం నిర్వహించారు. ఎ న్నికల నియమావళిని కచ్చితంగా అమ లు జేయాలని, పటిష్టమైన పోలీసు బందోబస్తుతో పాటు కంట్రోల్ రూమ్‌ల ను ఏర్పాటు చేయా లని ఆదేశించారు. ఎన్నికల పీవోలు, ఏపీవోల నియామకాలపై సమీక్షించారు. ఎన్నికల అధికారులు, సిబ్బంది, సూక్ష్మ పరిశీలకులకు ఎన్నికల నిర్వహణపై తగిన శిక్షణ అందించాలని ఆదేశించారు.


వీడియో సమావేశంలో పాల్గొన్న కలెక్టర్ దినేష్‌కుమార్, ఇతర అధికారులు

14మంది నోడల్ అధికారుల నియామకం

ఎమ్మెల్సీ ఎన్నికలకు సంబంధించి 14మంది నోడల్ అధికారులను నియమించామని కలెక్టర్ ఎ.ఎస్. దినేష్‌కుమార్ ఎన్నికల పరిశీలకురాలికి నివేదించారు. పీవోలు, ఏపీవోలు, ఇతర పోలింగ్ సిబ్బందికి ఈనెల 18, 24 తేదీలలో రెండు విడతలుగా శిక్షణ అందించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. 20వ తేదీన సూక్ష్మ పరిశీలకులకు శిక్షణ ఉంటుందన్నారు. ఈ సమావేశంలో జేసీ డాక్టర్ అభిషేక్ గౌడ, పాడేరు సబ్ కలెక్టర్ సౌర్యమన్ పటేల్, ఎస్‌డీసీ లోకేష్, డీఆర్వో పద్మలత, జిల్లా వ్యవసాయాధికారి నందు, డీఈవో పి.బ్రహ్మాజీరావు, డీఎస్‌వో గణేష్ తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు యోగా తరగతులు

- మార్చి 8న 15 వేల మంది విద్యార్థులతో యోగాసనాలు


రవ్వలగుడ పాఠశాలలో విద్యార్థులకు యోగాసనాలు చేయిస్తున్న ట్రైనర్ శ్రీనివాస్, విద్యార్థులకు

అరకులోయటౌన్: మండలంలోని రవ్వలగుడ ప్రభుత్వ గిరిజన సంక్షేమ బాలుర ఉన్నత పాఠశాలలో విద్యార్థులకు యోగ శిక్షణ కార్యక్రమాన్ని గురువారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కలెక్టర్ దినేష్‌కుమార్ ఆదేశాల మేరకు గత ఆరు నెలలుగా పాడేరు ఏజెన్సీలోని జి.మాడుగుల, పాడేరు, హుకుంపేట మండలాలోని 50 పాఠశాలల్లోని విద్యార్థులకు యోగ శిక్షణ కార్యక్రమం నిర్వహించినట్టు చెప్పారు. మార్చి 8వ తేది మహిళా దినోత్సవాన్ని పురస్కరించుకొని 15 వేల మంది ప్రభుత్వ గిరిజన సంక్షేమ ఉన్నత పాఠశాల విద్యార్థులతో యోగ కార్యక్రమం నిర్వహించనున్నట్టు యోగా గురువు పతంజలి శ్రీనివాస్ తెలిపారు. ప్రస్తుతం అరకులోయలో యోగ శిక్షణ తరగతులు ఇస్తున్నామన్నారు. మహిళా దినోత్సవం రోజున అరకులోయ ప్రభుత్వ డిగ్రీ కళాశాల క్రీడా మైదానంలో 140 నిమిషాల్లో 108 సూర్య నమస్కారాలు వేయిస్తామన్నారు. ఏటీడబ్ల్యూవో మల్లికార్జునరావు, హెచ్‌ఎం కెందు, విద్యార్థులు పాల్గొన్నారు.

ఏయూలో ఎన్‌ఎస్‌యూ ఫ్లోరిడా ప్రతినిధులు

విశాఖ విద్య: ఆంధ్ర విశ్వవిద్యాలయాన్ని నోవా సౌత్ ఈస్టన్ యూనివర్సిటీ (ఎన్.ఎస్.యు) అసిస్టెంట్ డైరెక్టర్, జోసెఫ్ స్లిబాతో కూడిన బృందం గురువారం సందర్శించింది. రిజిస్ట్రార్ ఆచార్య ఇ.ఎన్.ధనుంజయరావుతో కార్యాలయంలో మర్యాదపూర్వకంగా భేటీ అయ్యారు. ఈ సందర్భంగా రెండు విశ్వవిద్యాలయాల్లో నిర్వహిస్తున్న నూతన కోర్సులు ప్రత్యేకమైన అంశాలను పరస్పరం వివరించారు.

ప్రాథమిక విద్యపై కత్తి కట్టిన ప్రభుత్వం

- తక్కువమంది ఉంటే సమీప ఆశ్రమాలకు విద్యార్థుల తరలింపు
- 3, 4, 5 తరగతుల విద్యార్థులకు కష్టకాలం
- పెదబయలు మండలంలోని 32 పాఠశాలల్లో తల్లిదండ్రుల కమిటీలపై ఒప్పుకోవాలని ఒత్తిడి


జీవో 117ను రద్దు చేయాలని నినాదాలు చేస్తున్న సర్పంచ్ త్రినాథ్, ఉబ్బెంగుల గ్రామ గిరిజనులు, విద్యార్థులు

పెదబయలు: పదిమంది కంటే తక్కువ ఉన్న పాఠశాలల్లో 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలో ఉన్న గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలలకు తరలించాలని డైరెక్టర్ ఆఫ్ స్కూల్ ఎడ్యుకేషన్ జారీ చేసిన 117 జీవోను అనుసరించి అధికారులు ప్రణాళిక సిద్ధం చేస్తున్నారు. పెదబయలు మండలంలో తగ్గపాడు, పెదవంచరంగి, కొత్తాపుట్టు, ఉగ్రగరువు, కుమ్మరిపుట్టు, గజ్జెడి, గొచ్చరి, సాలేబులు, బొర్లాడ, గంపరాయి బొడ్డాపుట్టు, మొట్టలగుమ్మి, లకేయిపుట్టు, జామదంగి, లుగసరిపుట్టు, మూలగరువు, వనభంగి, కోంద్రు, బొడ్డగొంది, గోమంగి, సంపంగిపుట్టు, రాసగుప్ప, కోడాపుట్టు, జర్సింగి, బాసుల, పనసపుట్టు, బంగారుమెట్ట, కిండలం బొడ్డాపుట్టు, జె.పెదబయలు, కిత్తుకొండ, సంపంగిపుట్టు, రోగుల పేట, పెదకొండ పాఠశాలల్లో చదువుతున్న 3, 4, 5 తరగతుల విద్యార్థులను సమీపంలోని ఆశ్రమ పాఠశాలకు తరలించడానికి మండల విద్యాశాఖ అధికారులు కసరత్తు చేస్తున్నారు. ప్రస్తుతం 32 పాఠశాలలను గుర్తించి విద్యార్థుల తల్లిదండ్రుల కమిటీ నుంచి విద్యార్థుల తరలింపునకు అనుమతి తీసుకొనే ప్రక్రియ జరుగుతోంది. తల్లిదండ్రుల కమిటీలపై ఒత్తిడి తీసుకొస్తున్నారు. అయితే తల్లిదండ్రులు తమ పిల్లలను ఆశ్రమాల్లో చేర్పించడానికి సుముఖత చూపించడం లేదు. గ్రామాల్లో పాఠశాలలు ఉంటేనే విద్యార్థులు బడి మానేస్తున్నారు.. ఇలా జరిగితే గ్రామాల్లో మరింత డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉంది

విద్యార్థుల తరలింపు చర్యలు మానుకోవాలి

తక్కువ మంది ఉన్నారని 3, 4, 5 తరగతుల విద్యార్థులను ఆశ్రమాలకు తరలించడం మంచి పద్ధతి కాదని, గిరిజన గ్రామాల్లో మరింత డ్రాపౌట్స్ పెరిగే అవకాశం ఉందని వైఎస్సార్ సీపీ మండల అధ్యక్షుడు మజ్జి చంద్రుబాబు, పార్టీ సీనియర్ నాయకుడు సందడి కొండబాబు, గోమంగి ఉప సర్పంచ్ కూడ మత్స్య కొండబాబు, గిరిజన సంఘం మండల అధ్యక్షులు సన్నిబాబు, గంగాధరం, దేవరాజు అన్నారు. దీనిపై తల్లిదండ్రులతో కలిసి ఉద్యమం చేస్తామన్నారు. మారుమూల గ్రామాల్లో ఆశ్రమ పాఠశాలలకు 10 నుంచి 20 కిలోమీటర్ల దూరం ఉందన్నారు.

విద్యా వ్యవస్థ నాశనం

ఉబ్బెంగులలో విద్యార్థులు, తల్లిదండ్రులు నిరసన

ముంచంగిపుట్టు: ప్రభుత్వం అమలు చేస్తున్న జీవో నెంబర్ 117తో విద్య వ్యవస్థ నాశనం అవుతుందని, వెంటనే దానిని రద్దు చేయాలని లక్ష్మీపురం సర్పంచ్ కె.త్రినాథ్ డిమాండ్ చేశారు. లక్ష్మీపురం పంచాయతీ ఉబ్బెంగుల గ్రామంలో మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల ఎదుట విద్యార్థులు, తల్లిదండ్రులతో కలిసి గురువారం నిరసన కార్యక్రమం చేపట్టారు. జీవో 117ను రద్దు చేయాలని, 3, 4, 5 తరగతుల తరలింపు ఆలోచనను విరమించాలని నినాదాలు చేశారు. ఈ సందర్భంగా సర్పంచ్ త్రినాథ్ మాట్లాడుతూ ప్రభుత్వం జీవో నెంబర్ 117ను రద్దు చేస్తామని చెప్పి, 3, 4, 5 తరగతుల్లో 10 మంది కన్నా తక్కువ ఉంటే ఆ పాఠశాలల నుంచి ఉన్నత పాఠశాలలకు విద్యార్థులను తరలిస్తున్నారని విమర్శించారు. ప్రాథమిక పాఠశాలలను మూసివేసేందుకు రహస్యంగా చర్యలు మొదలు పెట్టారన్నారు. జీవో 117 అమలు జరిగితే మండలంలో 27 పాఠశాలలు మూతబడే అవకాశం ఉందని, తక్షణమే ప్రభుత్వం విద్యార్థుల తరలింపు ఆలోచన విరమించుకోవాలని, లేని పక్షంలో విద్యార్థులు, తల్లిదండ్రులతో విద్యాశాఖ కార్యాలయం ఎదుట ఆందోళన చేస్తామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల నేత సాధూరాం, పాఠశాల విద్యాకమిటీ చైర్మన్ జీవన్, ఉబ్బెంగుల గ్రామస్తులు పాల్గొన్నారు.

ఇద్దరు విద్యార్థులకు అస్వస్థత

భీమునిపట్నం: గొల్లలపాలెం సమీపంలోని సెడార్ పాఠశాలకు చెందిన ఇద్దరు విద్యార్థులు అస్వస్థతకు గురయ్యారు. 6వ తరగతి నుంచి ఇంటర్మీడియట్ వరకు సుమారు 80 మంది విద్యార్థులు వసతిగృహంలో చదువుకుంటున్నారు. ఇక్కడ విద్యార్థులకు రోజూ బయట వండించిన భోజనం పెడుతున్నారు. కాగా..బుధవారం రాత్రి ఇంటర్మీడియట్ మొదటి సంవత్సరం చదువుతున్న బక్క వైష్ణవి, 8వ తరగతి చదువుతున్న ఆదారి యశ్వంత్‌కు కడుపునొప్పి వచ్చింది. విషయం తెలుసుకున్న పాఠశాల సిబ్బంది వెంటనే వారిని ప్రభుత్వ ఆసుపత్రికి తీసుకువెళ్లి చికిత్స అందించారు. సమాచారం అందుకున్న ఎంఈవోలు శివరాణి, జయప్రద గురువారం పాఠశాలను సందర్శించారు. విద్యార్థులకు అందిస్తున్న ఆహారం, తీసుకుంటున్న జాగ్రత్తలపై ఆరా తీశారు. ఆహారం విషయంలో అప్రమత్తంగా ఉండాలని సిబ్బందిని ఆదేశించారు.

ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించాలి


వివిధ సంఘాల నేతల నిరసన

సీతమ్మధార: దేశ అటవీ ప్రాంతాల్ని కార్పొరేట్లకు కట్టబెట్టే లక్ష్యంతో ఆపరేషన్ కగార్‌ను కేంద్ర ప్రభుత్వం తలపెట్టి, ఆదివాసీలపై ప్రత్యక్ష సైనిక యుద్ధం చేస్తోందని వామపక్ష, ఆదివాసీ, హక్కుల, దళిత, ప్రజా సంఘాల నేతలు ఆందోళన వ్యక్తం చేశారు. తక్షణమే ఆపరేషన్ కగార్‌ను ఉపసంహరించాలని డిమాండ్ చేశారు. రాష్ట్ర వ్యాప్త కార్యక్రమంలో భాగంగా గురువారం జీవీఎంసీ గాంధీ విగ్రహం వద్ద ఆయా సంఘాల నేతలు నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా వారు మీడియాతో మాట్లాడుతూ మావోయిస్టుల నియంత్రణ పేరిట అడవుల్ని కార్పొరేట్లకు అప్పగించే లక్ష్యంతో ఆదివాసీల్ని బూటకపు ఎన్‌కౌంటర్లు చేస్తున్నట్లు ఆరోపించారు. సుప్రీంకోర్టు జోక్యం చేసుకుని న్యాయ విచారణ జరిపి, బాధ్యుల్ని శిక్షించాలని కోరారు. ఆపరేషన్ కగార్‌కు ప్రత్యక్షంగా, పరోక్షంగా సహకరించరాదని కూటమి ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో ఆయా సంఘాలు, వామపక్ష పార్టీల నాయకులు పాల్గొన్నారు.